సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 7 । డిసెంబర్ । 2024



పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యుఒడికి

ముగ్గురు స్నేహితులు కలిసి వివాహ వేడుకకు వెళ్లారు.. కొంతసేపటిలో ఇంటికి చేరుకుంటామనే లోపే మృత్యువు ముంచుకొచ్చింది. ఇద్దరు మృతి చెందారు. -10లో



'పుష్ప-2'లో రాజంపేట వాసులు

ఇప్పుడు దేశవ్యాప్తంగా పుష్ప-2 మేనియా నడుస్తోంది. ఈ సినిమాలో రాజంపేట పట్టణానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నటించారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.520	రూ.600
రెండోరకం	రూ.380	రూ.500

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 77 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

కడపలో మీనాక్షి చౌదరి సందడి



షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న సినీనటి మీనాక్షి చౌదరి

కడప కార్పొరేషన్: సినీ నటి మీనాక్షి చౌదరి కడపలో సందడి చేసింది. కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శుభమస్తు' షాపింగ్ మాల్‌ను ఆమె స్థానిక ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షిని చూసేందుకు పెద్ద ఎత్తున యువత షాపింగ్ మాల్ వద్దకు తరలి వచ్చారు. ఆమెతో ఫోటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'శుభమస్తు' షాపింగ్ మాల్ 7వ షోరూం తన చేతుల మీదుగా ప్రారంభం కావడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవి కుమార్, శ్రీనివాస రాజా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాయచోటి టౌన్: రైతులు స్వచ్ఛందగా పంటల బీమా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో అన్ని నియోజక వర్గాలు, మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–2025 రబీకి సంబంధించి రైతులు పంటలబీమా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి పసల్‌బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) దిగుబడి ఆధారంగా వరి, వేరుశనగ పంటలకు మండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణించనున్నట్లు చెప్పారు. రైతులు వరి పంటకు రూ.126, ఈనెల 31లోగా, వేరుశనగకు రూ.96 ప్రీమియం ఈనెల 15లోగా చెల్లించాలని సూచించారు. టమాటా పంటకు రూ.1600 ఈనెల 15లోగా చెల్లించాలన్నారు.

నేడు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్/ వేంపల్లె: జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు వేంపల్లెలోని వెలుగు కార్యాలయంలో ప్రముఖ కంపెనీలచే జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, అల్ డిక్సన్ కంపెనీలో వివిధ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 12 వేల నుంచి రూ. 21 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి: పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పేర్కొన్నారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం జిల్లా అదనపు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. పోలీస్ శాఖకు సహాయంగా వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం హోంగార్డు సిబ్బందికి క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అదనపు ఎస్పీ అందజేశారు. అలాగే విధినిర్వహణలో ప్రతిభ కనపరిచిన హోంగార్డ్స్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. హోంగార్డ్స్ పరేడ్ కమాండర్‌గా ఎస్ఎండీ తాహీర్‌బాషా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ బి.చిన్నికృష్ణ, ఏఓ బి.క్రిష్టుడు, ఎస్బీ సీఐ ఏ.సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజె రామకృష్ణ, టి.జాన్‌జోసెఫ్, ఎం.పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అరకొర నిధులతో ఎలా..?

నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

- డెకరేషన్, ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
- విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు మంజూరు
- పాఠశాల సమస్యల నుంచి పేరెంట్స్ దృష్టి మరల్చే ప్రయత్నం



మదనపల్లెలో జెడ్పీ ఉన్నత పాఠశాల

నిధులు మంజూరు ఇలా.. ఎన్‌రోల్‌మెంట్	నిధుల కేటాయింపు (రూ.లలో)
0–10	1000
11–25	1200
26–50	1600
51–75	2000
76–100	2400
101–200	3000
201–300	4000
301–400	5000
401–500	6000
501–600	7000
601–700	8000
701–800	9000
801–900	10,000
901–1000	11,000
1001–1500	12,000

మదనపల్లె సిటీ: ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులను దృష్టి మరల్చేందుకు పేరెంట్స్–టీచర్స్ కమిటీ పెడతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు పూర్తికావస్తున్నా నేటికీ బడుల్లో సమస్యలపై దృష్టి పెట్టలేదు. గత ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు అమలు చేసిన సీబీఎస్ఈ, ఇంగ్లిషు మీడియం, ట్యాబ్‌ల పంపిణీ, డిజిటల్ విద్య తదితర వాటికి మంగళం పాడే దిశగా పావులు కదుపుతోంది.

- శనివారం జిల్లాలోని 2177 పాఠశాలల్లో పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ పెడుతోంది. వీటిని నిర్వహించేందుకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అలంకరణ, టెంట్, మైకు, తల్లిదండ్రులకు విడివిడిగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేత, విద్యార్థులు, తల్లిదండ్రులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏ విధంగా సరిపోతాయని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంటున్నారు.



నిధులు మంజూరు ఇలా...

పాఠశాలల్లో జరిగే పేరెంట్స్‌టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 2177 పాఠశాలలకు రూ.39,19,800 నిదులు మంజూరు చేసింది. ఇంకా చాలక పోతే బయట నుంచి దాతల ద్వారా నిధులు సమీకరించుకోవాలని సూచింది.

అరకొర నిధులుపై మండిపాటు

పేరెంట్స్–టీచర్స్ సమావేశం పండుగలా నిర్వహించాలని ఆదేశించిన ప్రభుత్వం నిధుల విడుదలలో అంత శ్రద్ధకనబరచలేదని ఉపాధ్యాయులు, హెచ్ఎంలు మండిపడుతున్నారు. ఈ కార్యక్రమాలు ఏ విధంగా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు పాఠశాల అలంకరణకే సరిపోతాయంటున్నారు. పోటీల నిర్వహణకు వస్తువుల కొనుగోలు, బహుమతులు, టెంట్, మైకు తదితర వాటికి ఎక్కడ నుంచి నిధులు సమీకరించాలో తెలియడం లేదని వాపోతున్నారు.

నలిగిపోతున్న అయ్యవార్లు



మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులకు ఆహ్వానించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్ది కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. దీంతో పాటు హోలిస్టిక్ కార్డులు (ప్రగతి నివేదికలు) ఇవ్వడంతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహణ ఉపాధ్యాయులకు భారంగా మారింది. పాఠశాల ఫోటోతో పాటు సమావేశం బ్యానర్‌ను పెద్దగా తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంపై ఇటీవల ఎమ్మార్సీలలో ఎంఈఓలు టీచర్లకు సమావేశం సక్సెస్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. శనివారం రోజు ఎవరికి సెలువు కూడా మంజూరు చేయమని తప్పకుండా హాజరై సమావేశం సక్సెస్ చేయాలని ఆశించారు.

ఏ మాత్రం సరిపోవు



పాఠశాలల్లో నిర్వహించనున్న పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఏ మాత్రం సరిపోవు. ఈ కార్యక్రమం ఖర్చుతో కూడుకున్న పని. దాతలు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా మంజూరు చేసిన నిధులతో పాటు అదనంగా నిధులు మంజూరు చేయాలి.
–పురం వెంకటరమణ, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి

విజయవంతం చేద్దాం



శనివారం జరిగే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఆయా పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించాలి. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. ఇప్పటికే ఆయా మండలాల ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఎంఈఓలు పర్యవేక్షించాలి.
–సుబ్రమణ్యం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

కొత్తస్కాన్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసే స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలని డీఎంహెచ్ఓ కొండయ్య అన్నారు. గురువారం స్థాని డీఎంహెచ్ఓ కార్యాలయంలో కొండయ్య అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ చట్టం అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త స్కాన్‌సెంటర్ల రిజిస్ట్రేషన్‌తో పాటు పాత సెంటర్లను కూడా నిర్ణీత వ్యవధిలోగా తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్నిరకాల స్కానింగ్ సెంటర్‌లను అధికారులు తరచూ తనఖీచేస్తూ అక్కడ సక్రమంగా రికార్డులు నిర్వహిస్తున్నారా ? లేదో గమనించి తగిన సలహాలు, ఇవ్వాలని సూచించారు. జిల్లా పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారిణి ఉషశ్రీ మాట్లాడుతూ లింగనిర్ధారణ చేసేవారితో పాటు చేయమని ప్రోత్సహించే వారిపై కూడా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పీసీపీఎన్‌డీటీ పోగ్రాం అధికారిణి దేవశిరోమణి మాట్లాడుతూ లింగనిర్ధారణ నిషేధచట్టాన్ని ఉల్లంఘించే వైద్యులకు మొదటితప్పుగా రూ.10వేలు జరిమానా, 3 సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. 2వ వసారి తప్పుచేస్తే రూ.50వేలు జరిమానాతో పాటు 5 సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. 3వ సారి తప్పుచేస్తే మెడికల్ కౌన్సిల్‌నుంచి వైద్యుల పేర్లను తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు నీలోఫర్ బేగం, చిన్నపిల్లల వైద్యులు నిస్సార్ అహమ్మద్, ఖైరూన్, లీగల్‌కం ప్రొబేషన్ ఆఫీసర్ స్వాతి, పిసిఎస్ఎస్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి బాలక్రిష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరామరాజు, ఉషారాణి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎంపీ మిథున్ రెడ్డి కృషి

మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

మదనపల్లె: రాజంపేట ఎంపీ శ్రీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చేసిన కృషి ఫలించింది. మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం కేంద్రంలో చేసిన అనేక ప్రయత్నాలు ఇప్పుడు కార్యరూపం దాల్చనున్నాయి. కేంద్రం తాజాగా విడుదల చేసిన నూతన కేంద్రీయ విద్యాలయాల జాబితాలో మదనపల్లె కూడా మెరిసింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ కూడా ఆమోదముద్ర వేసింది. రానున్న విద్య సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మన ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నందుకు ఎంపీ శ్రీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ కృషి వల్లే ఇది సాధ్యమైందని నగర వాసులు సంబర పడుతున్నారు.

సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తే చర్యలు: ఎస్పీ

రాయచోటి: రాయచోటిలో జరుగుతున్న పరిణామాల పట్ల ఆకతాయిలు ఎవరైనా సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారాలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి అన్నమయ్య జిల్లా రాయచోటిలో పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ పేర్కొన్నారు. రెండు రోజులుగా రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదాన్ని కొందరు ఆకతాయిలు, వాట్సాప్ గ్రూప్‌లు, సోషల్ మీడియాలో అవాస్తవాలు, అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. రాయచోటిలో జరిగిన ఘటనలో ఇప్పటికే 150 మంది అసాంఘిక శక్తులను డ్రోన్ టెక్నాలజీ, ఇతర అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు ఎస్పీ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న మంత్రి, జిల్లా కలెక్టర్‌లు

సంబేపల్లె: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి , జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేటి, రీ సర్వే, ఇతర రెవిన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రెవిన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అన్యాయంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలకు సంబంధించి రాజ్యాంగ విలువలు, హక్కులను కాపాడేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అదివో.. అల్లదివో..





కడప-రేణిగుంట జాతీయరహదారిలోని బోయనపల్లెలో ఆకేపాటిని గజమాలతో సత్కరిస్తున్న నేతలు, ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్రలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

- ఆకేపాటి తిరుమల మహాపాదయాత్ర
- మారుమోగిన గోవిందనామస్మరణలు

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు నడిచిన కాలిబాటలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి 22వ సారి తిరుమల పాదయాత్రను శుక్రవారం చేపట్టారు. అంతకముందుగా శ్రీవారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం ఆకేపాడు ఆలయాల సముదాయాల నుంచి బయలుదేరిన పాదయాత్ర ఆకేపాడు క్రాస్, ఎర్రబల్లి, అన్నమాచార్యయూనవర్సిటీ సర్కిల్, తాళ్లపాక ఆర్చి, మన్నూరు ఎల్లమగుడి, ఆర్టీసీ బస్టాండు, మార్కెట్ ఏరియా, శివాలయం క్రాస్, పాతబస్టాండు, తిరుపతిరోడ్డులోని ఎస్ఆర్ కళ్యాణమండపం వరకు కొనసాగింది. ఈ పాదయాత్రలో బద్వేలు ఎమ్మెల్యే సుధారాణి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, జడ్పీవైస్‌చైర్మన్ బాలయ్య,కడప డిప్యూటీమేయర్ నిత్యానందరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ ఇరంగరెడ్డి సుబ్బారెడ్డి, టీటీడీ బోరు మాజీ సభ్యుడు మాసీమబాబు, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్, రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పీసీయోగీశ్వరరెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వీరబల్లిఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి,మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మర్రిరవి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కృష్ణారావుయాదవ్ ,బీసీజిల్లానేత ఈశ్వరయ్య, నేతలు భాస్కర్‌రాజు, జీవీసుబ్బారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, మహిళనేత మిరయాలసురేఖ, కోలాకొండయ్య, పసుపులేటి మనోజ్,వెంకట్రాజు, ముస్లింమైనార్టీనేతలు, ఆర్యవైశ్య, బీసీవర్గాలకు నాయకులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసమే..

లోకకల్యాణంకోసం అన్నమయ్య కాలిబాటలో తిరుమలకు తిరుమల మహా పాదయాత్ర చేపట్టాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి అడుగులు పడ్డాయి. దీనిని అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఉంది. – **ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట**

అడుగడుగునా ఘనస్వాగతాలు..

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత ఆకేపాటి అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆకేపాటి పాదయాత్ర రాజంపేట పట్టణంలో చేరుకోగానే మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతంపలికారు. అన్ని వర్గాలకు చెందిన నాయకులు గజమాలలతో సత్కరించారు.

ఘనంగా శ్రీదేవి,భూదేవిలతో శ్రీ వెంకటేశ్వరస్వామి ఊరేగింపు

తిరుమల మహాపాదయాత్రలో ప్రధానంగా ప్రత్యేక రథంపై శ్రీదేవి, భూదేవిలతో శ్రీ వెంకటేశ్వరస్వామి ఊరేగింపు కొనసాగింది. కోలాటాలు, భజనలు యాత్రలో నిరంతరం కొనసాగాయి. పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు కీర్తనలు భక్తి భావాన్ని పెంపొందించాయి.

రాయచోటిలో ఉద్రిక్తత

- రోడ్డుపై బైఠాయించిన ఇరువర్గాలు
- శాంతింపచేసిన పోలీసులు



ఠాణా సమీపంలో పోలీసులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ర్యాలీగా వెళ్తున్న ఒక వర్గం వారిని నిలువరిస్తున్న పోలీసులు

రాయచోటి: రాయచోటిలో ఇరువర్గాల మధ్య తలెత్తిన మనస్పర్థలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఇరువర్గాలు రోడ్డుపై బైఠాయించాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులను శాంతింపచేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం శ్రమించాల్సి వచ్చింది. గురువారం రాత్రి అయ్యప్ప స్వాములు గ్రామోత్సవంలో భాగంగా ఎస్ఎన్ కాలనీలోని శివాలయం నుంచి జూనియర్ కళాశాల, నేతాజీ సర్కిల్, ఠాణా మీదుగా బండ్లపెంట, గాంధీ బజార్, బస్టాండు, కొత్తపేట నుంచి రాత్రి 12 గంటలకు గ్రామోత్సవం ర్యాలీ శివాలయం చేరుకుంది. ఈ సమయంలో ఠాణా సమీపంలోకి రాగానే మరో వర్గానికి చెందిన కొంత మంది మధ్య సంభవించిన మాటలు ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీశాయి. వెంటనే జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్‌లు తమ సిబ్బందితో పర్యవేక్షించి పరిస్థితులను అదుపులోకి తెచ్చారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో కొంత మంది ఆకతాయిలు అటుగా వస్తున్న ఒక బస్సు, మరో వాహనం అద్దాలను పగులగొట్టారు. ఇదే విషయంపై శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో అయ్యప్ప స్వాములు మరికొంత మంది కలిసి బస్సు, మరో వాహనంపై దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు కాలినడకన ఎస్పీ కార్యాలయానికి బయలుదేరారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు శివాలయం సమీపంలోనే నిలువరించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. జనసమూహం పెరగడంతో అక్కడికి వచ్చిన పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. పోలీసులను లెక్కచేయక నేతాజీ సర్కిల్ సమీపానికి భారీ సమూహంతో చేరుకున్నారు. అప్పటికే విషయాన్ని పసిగట్టిన జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ యంత్రాంగానికి ఎలాంటి కవ్వింపులు, ఘర్షణలకు తావివ్వకుండా గుంపులను చెదరగొట్టేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా అదనపు ఎస్పీ, డీఎస్పీలు భారీ పోలీసులతో నేతాజీ సర్కిల్ దాటి వెళ్లనీయకుండా చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మరో వర్గం వారు ఠాణా సమీపంలోని మసీదుల పరిసర ప్రాంతాలలో జనసమూహం ఏర్పడటంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాయచోటిలో ఏర్పడ్డ ఉద్రిక్తత పరిస్థితులను అదుపు చేయడానికి జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇరువర్గాలు శాంతించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు.

- రాయచోటి పట్టణంలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తుతో పహారా కాస్తోంది. ప్రజలు గుంపులు గుంపులుగా లేకుండా పనులను ముగించుకొని ఇండ్లకు వెళ్లిపోవాలని సూచనలు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతి



పులివెందుల రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సోదరుడు దివంగత వైఎస్ జార్జిరెడ్డి 25వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. పులివెందులలోని వైఎస్సార్ ఫ్యామిలీ సమాధుల తోటలో వైఎస్ జార్జిరెడ్డి ఘాట్ వద్ద జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మతోపాటు కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. వైఎస్ రాజారెడ్డికి ఐదుగురు కుమారులు ఉండగా, ప్రథమ పుత్రుడు జార్జిరెడ్డి. శనివారం భాకరాపురంలో వైఎస్ జార్జిరెడ్డి ఐటీఐ కళాశాలలో వైఎస్ భారతమ్మ.. విద్యార్థులు, అనాథలకు దుస్తులు పంపిణీ చేయనున్నారు. అనంతరం జీసెస్ చారిటీస్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

పట్టపగలే చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

అట్లూరు : మండల పరిధి అట్లూరు క్రాస్ రోడ్డులోని ఎగువపల్లె కాలనీలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎగువపల్లె కాలనీలో చల్లా లక్షుమ్మ, పాలకొండయ్య దంపతులు శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కాలనీలోని తెలిసిన వారి ఇంటికి వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు లక్షుమ్మ ఇంట్లో ఉన్న 48 గ్రాముల బంగారు నగలు దొంగలించారు. ఇంటికి వచ్చి చూసే సరికి వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బంగారాన్ని వెతకగా కనిపించకపోవడంతో స్థానిక ఎస్ఐ రామకృష్ణకు లక్షుమ్మ, పాలకొండయ్య కుమారుడు కొండయ్య ఫిర్యాదు చేశారు. వెంటనే రూరల్ సీఐ నాగభూషణంతోపాటు గోపవరం ఎస్ఐ శ్రీకాంత్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి వారు దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో దొంగల చేతివాటం

కమలాపురం : పట్టణ పరిధిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారెడ్డి సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఆలయ ఆవరణలో ఓ వైపు అయ్యప్ప, శివమాల ధారణ భక్తులకు భోజనాలు వండే పనిలో వంట మనిషి ఇతర సిబ్బంది ఉన్నారు. మరో వైపు గురువారం కావడంతో భక్తులు వచ్చి పూజలు చేసి వెళ్లిపోయారు. ఆలయంలో ఎవరూ లేరని గమనించిన గుర్తు తెలియని దుండగులు లోపలికి వెళ్లి స్వామి వారి వద్ద వెండి పల్లం, రెండు పావుకోళ్లను అపహరించుకు వెళ్లారు. దాదాపు 2 కిలోలు ఉంటాయని, వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని ఆలయ చైర్మన్ తెలిపారు. పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.

పుష్ప-2లో రాజంపేట వాసులు

సినిమాలో నటించిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు



చిత్రంలోని ఓ సన్నివేశంలో అరవ మోహన్‌రావు



దర్శకుడు సుకుమార్‌తో మోహన్‌రావు

రాజంపేట టౌన్ : ఇప్పుడు దేశవ్యాప్తంగా పుష్ప-2 మేనియా నడుస్తోంది. ఏ నలుగురు కలిసినా ఈ చిత్రం గురించే మాట్లాడుకుంటున్నారు. అలాంటి పుష్ప-2 సినిమాలో రాజంపేట పట్టణానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నటించారంటే నిజంగా విశేషమనే చెప్పాలి. మండలంలోని కొల్లావారిపల్లె ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న అరవ మోహన్‌రావు, మందపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన కంభం శివకుమార్ ఈ చిత్రంలో నటించారు. ఇందులో మోహన్‌రావు అల్లుఅర్జున్ సోదరుడైన అజయ్‌కి వెన్నంటి ఉండే పాత్రను, శివకుమార్ వీడియో జర్నలిస్టు పాత్రను పోషించారు. పుష్ప-2 ఎంతో క్రేజీ మూవీ కావడం, అలాగే విడుదలైన అన్ని ప్రాంతాల్లో కాసుల వర్షం కురిపిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన సినిమాలో రాజంపేటకు చెందిన ఇద్దరు కళాకారులు నటించడం జిల్లా వాసులకే గర్వకారణమని చెప్పాలి. ఆ మూవీలో నటించిన ఇద్దరూ రాజంపేట పట్టణంలోనే నివాసముండటం, ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడం కాకతాళీయమైనప్పటికీ ఈ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పుకొంటున్నారు. వారు ఎవరి సిఫారసు లేకుండా తమలోని నటనా ప్రతిభను కనబరచి అవకాశాన్ని దక్కించుకోవడం విశేషం.

ఎంతో గర్వంగా ఉంది



ప్రపంచ వ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న పుష్ప-2 మూవీలో నటించడం నాకెంతో గర్వంగా వుంది. రాజంపేట వంటి చిన్న పట్టణంలో ఉన్న నాకు పుష్ప పార్ట్-1, పార్ట్-2 రెండింటిలోనూ నటించే అవకాశం వచ్చింది. చిన్న కళాకారుడిని కూడా ఎంతో గౌరవించే మంచి మనసున్న అల్లు అర్జున్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం నా జీవితంలో మరచిపోలేనిది.

– అరవ మోహన్‌రావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజంపేట

వీడియో జర్నలిస్ట్ అంటున్నారు



నేను పుష్ప-2 మూవీలో వీడియో జర్నలిస్టుగా చేశాను. ఇప్పుడు మా ఫ్రెండ్స్, బంధువులు, తోటి ఉపాధ్యాయులు వీడియో జర్నలిస్ట్ అని పిలుస్తున్నారు. పుష్ప-2 మూవీకి ఉన్న క్రేజ్ వల్లే నా పాత్రకు వెంటనే గుర్తింపు వచ్చింది. అల్లుఅర్జున్‌కు ఉన్న క్రేజ్ వల్లే ప్రపంచ వ్యాప్తంగా పుష్ప-2 మేనియా నడుస్తోంది. టాలీవుడ్‌లో ఎంతో క్రేజీ స్టార్ అయిన అల్లుఅర్జున్ చిత్రంలో.. నేను నటించడం మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది.

– కంభం శివకుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజంపేట

ఆవులను తప్పించబోయి.. కొండను ఢీకొట్టి..

108 వాహన డ్రైవర్ మృతి



మృతి చెందిన రమేష్‌బాబు

రామాపురం/బ్రహ్మంగారిమఠం : ఆవులను తప్పించబోయి కొండను ఢీకొట్టడంతో 108 వాహన డ్రైవర్ మృతి చెందాడు. రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బ్రహ్మంగారిమఠానికి చెందిన ఎస్.రమేష్‌బాబు(35) రామాపురం మండలంలో 108 వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆ వాహనానికి కడపలో మరమ్మతులు చేయించుకుని గురువారం రాత్రి తిరిగి ములకలచెరువుకు పయనమయ్యాడు. కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో రెండో మలుపు వద్ద ఆవులు అడ్డం రావడంతో.. వాటిని తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్, కొండను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. రమేష్ బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లె ఎస్సీ కాలనీలో రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విచారణ

కడప అర్బన్ : 108 వాహన డ్రైవర్ రమేష్ మృతి సంఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. మృతుడి భార్య అనూషతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కాగా ఈ సంఘటనపై పూర్తి వివరాలు అందజేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కడప అర్బన్ : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన సులభ్‌కాంప్లెక్స్ సమీపంలో 2020 మే 31న రాయల్‌హాల్ వీధికి చెందిన షేక్ ఖాదర్‌వలీ(24)ని షేక్ షాలు అనే యువకుడు కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అప్పటి సీఐ టి.వి.సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ కడపలోని జిల్లా కోర్టులో జిల్లా జడ్జి జి.శ్రీదేవి తీర్పు చెప్పారు. నేరం రుజువు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డి.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వి.సుబ్బలక్షుమ్మతోపాటు, సీఐ బి.రామకృష్ణ, సిబ్బంది తమ వంతుగా కృషి చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నాగేశ్వరి, సుజాతమ్మ అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ఐసీడీఎస్ పీడీ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్ర భవనాల అద్దెలు చెల్లించాలని కోరారు. సుండుపల్లె, వీరబల్లి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్టవ్‌లు, డబుల్ సిలిండర్‌లను సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, గౌరవ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు భారతి, స్వర్ణలత లోకేశ్వరి, రేష్మా, శ్రీలక్ష్మి, రమాదేవి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుల దాడి

పెండ్లిమర్రి : మండలంలోని గోపరాజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నంద్యాల సుబ్బరాయుడుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం రాత్రి రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బరాయుడు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈ విషయాన్ని కొందరు టీడీపీ నాయకులు ఓర్వలేకపోయారు. రాత్రి అతను నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వద్ద నుంచి ఊరి బయటకు వెళ్తుండగా గమనించి.. గోపాల్, గంగరాజు, మస్తాన్, మరికొందరు రాళ్లు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. గతంలో కూడా ఇతనిపై టీడీపీ నాయకులు మచ్చుకత్తితో దాడి చేసి గాయపరిచారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మైదుకూరు : అక్రమంగా తరలిస్తున్న 26 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని మైదుకూరులో శుక్రవారం ఉదయం పౌరసరఫరాల సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. మైదుకూరు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు నుంచి పెద్దముడియం మండలం గుండ్లగుంటకు చెందిన కామేశ్వర్‌రెడ్డికి చెందిన లారీలో బియ్యాన్ని తరలిస్తుండగా.. పౌరసరఫరాల సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు డివిజన్ డిప్యూటీ తహసీల్దార్ సంపతి శివకుమార్, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. లారీలో 520 బస్తాల మేరకు రూ.11 లక్షల విలువైన 26 టన్నుల రేషన్ బియ్యం ఉన్నాయి. లారీతోపాటు లారీ డ్రైవర్లు షేక్ గైబుసాబ్, షేక్ బాషాలను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత బియ్యాన్ని మైదుకూరు పౌరసరఫరాల గోదాం డిప్యూటీ తహసీల్దార్ సుశీలకు అప్పగించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు పేర్కొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

చక్రాయపేట : మండలంలోని గండికోవూరు గ్రామం దళితవాడకు చెందిన దండు యోగాంజనేయులు (36) శుక్రవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యోగాంజనేయులు, నల్లకదిరిగాళ్ల నాగార్జున మురుగు నీటి విషయమై గొడవపడ్డారు. ఈ సందర్భంలో నాగార్జున కట్టెతో యోగాంజనేయులును బలంగా కొట్టడంతో కింద పడ్డాడు. అతన్ని కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే యోగాంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు

పెన్నాలో యువకుడి గల్లంతు

వల్లూరు (చెన్నూరు) : మండల పరిధిలోని వాటర్ గండి వద్ద పెన్నా నదిలో నీటిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. చెన్నూరు మండలం ఓబులంపల్లె పంచాయతీ పరిధిలోని వాటర్ గండికి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కడప నగరం చిన్నచౌక్ అశోక్ నగర్‌కు చెందిన దాట్ల యోహాన్ (30) విహారయాత్రకు వచ్చారు. సాయంత్రం 4.30 ప్రాంతంలో ఈత కొడుతూ పెన్నా నదిలో గల్లంతు అయ్యాడు. విషయం తెలిసిన వెంటనే సీఐ పురుషోత్తంరాజు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సోమశిల జలాలతో అప్రమత్తత అవసరం



గృహాల వద్దకు చేరుతున్న జలాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఒంటిమిట్ట సీఐ టి.బాబు, ఎస్ఐ శివప్రసాద్ సూచించారు. సోమశిల రిజర్వాయర్ వెనుక జలాలు.. పైన తెలిపిన రెండు గ్రామాల గృహాల సమీపానికి చేరుకోవడంతో మండల పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయింది. శుక్రవారం ఆ గ్రామాలను ఒంటిమిట్ట సీఐ, ఎస్ఐ సందర్శించి, సోమశిల వెనుక జలాలు ఇళ్ల సమీపానికి చేరిన పరిసరాలను పరిశీలించారు. సోమశిల జలాశయంలో ప్రస్తుతం 72 టీఎంసీల నీళ్లు నిలువ చేసి ఉన్నారని, అధికారులు 74 టీఎంసీల వరకు నిలువ చేస్తారని తెలిసిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు. అలాగే సోమశిల వెనుక జలాల్లో విష పురుగులు సంచరించే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

ఘనంగా కళా ఉత్సవాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : రాయచోటి డైట్ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి కళా ఉత్సవాలు-2024 ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. గానం, నృత్యం, సంగీతం, నాటకం తదితర కళలు ప్రదర్శించారు. రాయచోటి ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు నాలుగు విభాగాల్లో నాలుగు బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, బహుమతులు అందజేశారు. విజేతలు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కళా ఉత్సవాల్లో పాల్గొనాలని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పాలవ్యాపారి

కడప అర్బన్ : కడప నగరంలోని పాతకడపకు చెందిన పాలవ్యాపారిని రిమ్స్ పీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇతను రామాంజనేయపురానికి చెందిన ఓ మహిళకు, కాగితాలపెంటకు చెందిన ఓ మహిళకు ప్రతి రోజూ పాలు పోస్తుంటాడు. శుక్రవారం రామాంజనేయపురంలో పాలు పోస్తూ ఫొటో తీస్తుండగా.. చూసిన మహిళ అభ్యంతరం వ్యక్తం చేసింది. తరువాత కడపలోని సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రిమ్స్ పీఎస్ పోలీసులు పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?

కడప నగర మేయర్ సురేష్‌బాబు



మాట్లాడుతున్న కడప నగర మేయర్ సురేష్‌బాబు

సిద్దవటం : 'ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి చంద్రబాబు' అని కడప నగర మేయర్ సురేష్‌బాబు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. సిద్దవటం మండలంలోని మూలపల్లె గ్రామంలో ఓ కార్యక్రమానికి శుక్రవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మోసగించడంలో బాబు సూపర్ అన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు బాదుడే-బాదుడు అని విమర్శించిన చంద్రబాబు నాయుడు.. అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు అమాంతంగా పెంచారని పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు బాబు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. అధికారం చేపట్టిన 6 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుందని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు వైఎస్ఆర్‌సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల అధికార ప్రతినిధి ఉపాసి వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, సిద్దవటం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గోపాలస్వామి, మాజీ సర్పంచ్‌లు కె.వి.సుబ్బయ్య, ముసలి శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, బండిమునిరెడ్డి, క్రిష్ణ చైతన్య, కె.వి.సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి తదిరతరులు పాల్గొన్నారు.

జీఓ 145ను రద్దు చేయాలి



కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన ప్రదర్శన

రాయచోటి అర్బన్ : న్యాయవాదులకు ఇబ్బందికరంగా పరిణమించిన జీఓ నంబర్ 145ను రద్దు చేయాలని రాయచోటి న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు రాయచోటి కోర్టు సముదాయాల ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రెడ్డెయ్య, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో ఉన్న మొదటి తరగతి జిల్లా కోర్టులలో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం జరగవలసిన క్రిమినల్ కేసులు జరిగే అవకాశం లేకుండా ప్రభుత్వం జీఓ 145ను తీసుకురావడం దారుణమన్నారు. రాయలసీమ జిల్లాలన్నింటికి కలిపి తిరుపతి కేంద్రంగా ఒక కోర్టు ఉంటుందన్నారు. కోస్తా ప్రాంతానికి నాలుగు కోర్టులు పని చేస్తాయని చెప్పారు. ఫలితంగా కక్షిదారులకు సుదూర ప్రాంతాల ప్రయాణంతోపాటు ఆర్థిక భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, ఐఏఎల్ కడప ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వర్, న్యాయవాదులు శ్రీనివాసులురెడ్డి, ఆనంద్‌కుమార్, రాజమనోహర్, ధనుంజయ, రామాంజులు, రవిశంకర్, తాహిర్, నాగమల్లు, వీరభద్రయ్య, కుసుమ, వరలక్ష్మి, ఖాదర్‌బీ, సయ్యద్‌బాషా, ఇలియాస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన వాహనాలు



ప్రమాదంలో గాయపడిన బాధితులు

కురబలకోట : మండలంలోని సర్కారుతోపు వద్ద శుక్రవారం ఎక్స్‌యువి వాహనం, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంగళ్లు స మీపంలోని ఓ కళాశాలకు చెందిన విద్యార్థులు రవితేజ (19), కె.అజయ్‌కుమార్ (20), మంజునాథ్ (20), సుబ్రమణ్యం (19) ఎక్స్‌యువి వాహనంలో వస్తుండ గా.. సర్కారుతోపు వద్ద బండి అదుపు తప్పింది. ట్రా క్టర్‌ను ఢీకొనడంతో అది కూడా బోల్తాపడింది. దాంతోపాటు ఎక్స్‌యువి పల్టీలు కొడుతూ బోల్తాపడింది. వాహనంలో ఆ నలుగురు విద్యార్థులు ఇరుక్కుపోయారు. వారిని స్థానికులు బయటకు తీసి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే ట్రాక్టర్ నడుపుతున్న కనసానివారిపల్లెకు చెందిన ఆర్.బాలకృష్ణ (45) తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను కూడా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. అదే సమయంలో ఆమార్గంలో మదనపల్లె వెళుతున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సంఘటన స్థలం వద్ద ఆగి ప్రమాద కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యుఒడికి

- డివైడర్‌ను ఢీకొన్న బైక్
- ఇద్దరు యువకుల మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



దామోదర్‌రెడ్డి మృతదేహం



మృతి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె : ముగ్గురు స్నేహితులు కలిసి బంధువుల వివాహ వేడుకకు వెళ్లారు.. రాత్రంతా ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు.. తెల్లవారుజామునే ముహూర్తం పూర్తి కాగానే ఇంటికి తిరుగు పయనమయ్యారు.. కొంతసేపటిలో ఇంటికి చేరుకుంటామనే లోపే మృత్యువు ముంచుకొచ్చింది.. వారు వస్తున్న ద్విచక్రవాహనమే వారి పాలిట మృత్యు శకటమైంది.. అతివేగం రెండు కుటుంబాలలో తీరని వేదనను మిగిల్చింది. శుక్రవారం తెల్లవారుజామున మదనపల్లె పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట ఏపీ గోడౌన్ వద్ద ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి, ద్విచక్ర వాహనం అదుపుతప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొన్న ఘోర ప్రమాద ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం తుమ్మనగుట్ట పంచాయతీ బండమీదపల్లికి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి(25), మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె మాయాబజారుకు చెందిన దామోదర్‌రెడ్డి (25), మహేంద్ర(20) కలిసి గురువారం రాత్రి కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని భారత్ కల్యాణ మండపంలో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లారు. రాత్రంతా స్నేహితులు, బంధువులతో సరదాగా, ఉత్సాహంగా, సంతోషంగా గడిపారు. శుక్రవారం తెల్లవారుజామున ముహూర్తం పూర్తి కావడంతో ముగ్గురు యువకులు కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయల్దేరారు. మార్గంమధ్యలోని అమ్మచెరువు మిట్ట ఏపీ గోడౌన్ వద్ద ముందు వెళ్తున్న లారీని అధిగమించే క్రమంలో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న నరేష్‌కుమార్‌రెడ్డి(25) దుర్మరణం చెందగా , దామోదర్‌రెడ్డి(25), మహేంద్ర(20) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు, 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో తీవ్రంగా గాయపడిన బాధితులను 108 వాహనంలో స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతూ దామోదర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. బాధితుడిని ప్రైవేట్ అంబులెన్స్‌లో తీసుకు వెళుతుండగా మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో నరేష్ కుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పట్టణంలోని నీరుగట్టు వారిపల్లె మాయాబజార్‌కు చెందిన మధు కుమారుడు చేనేత కార్మికుడైన మహేంద్ర ను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కష్టారెడ్డి ఉమాదేవి దంపతుల కుమారుడైన నరేష్‌కుమార్‌రెడ్డి, ఓవైపు ఎయిర్‌టెల్ కంపెనీలో ఉద్యోగిగా, మరోవైపు చేనేత పనులు చేస్తూ రెడ్డీస్ కాలనీలో ఉంటున్నాడు. అతనికి అమృతతో రెండేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఇటీవలే ఓ మగబిడ్డ జన్మించాడు. రెండు రోజుల క్రితం ఆ బిడ్డకు నామకరణ మహోత్సవం చేశారు. మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌లో నివాసం ఉన్న సిద్ధలింగారెడ్డి, అనసూయమ్మ దంపతుల కుమారుడు దామోదర్‌రెడ్డి డిగ్రీ వరకు చదువుకొని స్థానికంగా చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. కొంత కాలం క్రితం తండ్రి మరణించడంతో కుటుంబ బాధ్యతలు దామోదర్‌రెడ్డి చూస్తున్నాడు. ప్రమాద ఘటనలో నరేష్‌కుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి మృతి చెంది వివిధ జీవులుగా మారడంతో, వారి మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మహేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు.



ఆస్పత్రి మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు